క్లుప్తంగా

నేడు చుక్కల భూముల పట్టాల పంపిణీ

క్రోసూరు: చుక్కల భూముల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని చెప్పారు.

గిరిజనేతరులను ఎస్టీల్లో చేర్చవద్దు

నకరికల్లు: గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేరిస్తే అసలైన ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని గిరిజన రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.కోటానాయక్ అన్నారు. జూన్ 4వ తేదీన నరసరావుపేటలోని సీపీఐ హాలులో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతు, ఒరియ తదితర గిరిజనేతరులను ఎస్టీల్లో చేర్చవద్దన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్టీలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే కొత్తవారిని ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పెదకూరపాడు: మండలంలోని గారపాడు బీసీ కాలనీ శివారులో పేకాటాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. ముందస్తు సమాచారంతో ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేయగా పది మందిని పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.5,150, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడెల శివరామ్‌కు టీడీపీ నేతల బుజ్జగింపు

సత్తెనపల్లి: మాజీ స్పీకర్ దివంగత కోడెల శివప్రసాదరావు తనయుడు కోడెల శివరామ్‌ను బుజ్జగించేందుకు జిల్లా టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. సత్తెనపల్లిలోని కోడెల శివరామ్ కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, కొండేపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి శుక్రవారం చర్చించారు. సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ పేరును అధిష్టానం ప్రకటించడంతో కోడెల శివరామ్ తిరుగుబాటు బావుట ఎగురవేసి అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీ జిల్లా నాయకులు సుమారు రెండు గంటల పాటు శివరామ్‌తో ఏకాంతంగా సుదీర్ఘ చర్చలు జరిపారు. అయినప్పటికీ శివరామ్ ఏ మాత్రం వెనకడుగు వేయలేదని సమాచారం.


వృద్ధులకు వైద్యసేవలు

సత్తెనపల్లి: కంటి సమస్యలపై అవగాహన అవసరమని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవ్వా తాతలకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు మూడో దశలో భాగంగా సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలో శుక్రవారం నేత్ర స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ యు.శ్రీలక్ష్మీకవిత, ఆప్తమాలిక అసిస్టెంట్స్ సిహెచ్.మధు, ఎం.పావని, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు ఉన్నారు.

ఎన్‌క్యూఎస్‌కు ఎంపికైన ముప్పాళ్ల పీహెచ్‌సీ

ముప్పాళ్ల: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎన్‌క్యూఎస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్)కు ఎంపికైనట్లు ఎంపీపీ మారూరి పద్మ శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీన ఎన్‌క్యూఎస్ బృందం సభ్యులు పీహెచ్‌సీ సందర్శించినట్లు చెప్పారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, నిర్వహణ, వసతులపై రెండు రోజుల పాటు తనిఖీ నిర్వహించినట్లు వివరించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి ఎంపిక చేసినట్లు చెప్పారు. మూడేళ్ల పాటు ఏడాదికి రూ.3లక్షల చొప్పున పీహెచ్‌సీ అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయనుంది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు పీ రమాదేవి, జయకృష్ణ, వైద్య సిబ్బందిని ఎంపీపీ మారూరిపద్మ అభినందించారు.

ఇంటర్ విద్యార్థినికి సత్కారం



సత్తెనపల్లి: ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామానికి చెందిన వేదాంతం వైష్ణవికి బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. వైష్ణవి ఇంటర్మీడియెట్‌లో 943 మార్కులు సాధించిన సందర్భంగా జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో పాటు రూ.1,116 నగదును వేదాంతం కృష్ణ చైతన్య అందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు పెద్దింటి పణి కృష్ణ, పూర్వాధ్యక్షుడు కొండ కావూరి మార్కండేశ్వర శర్మ, బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కోనంకి మారుతి, ఆది శైవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

సారాతో అంధకారం

నకరికల్లు: మండలంలోని చేజర్ల తండాలో నాటుసారా తయారీపై ప్రజలకు అవగాహన సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు, ఎస్ఐ పి.సురేష్ పాల్గొన్నారు.

రైతన్నకు సాగు పండుగైంది.. సాగు లాభసాటిగా మారింది.. అడుగడుగునా ప్రభుత్వ మద్దతు కొనసాగుతోంది.. గతంలో విత్తనాలు.. ఎరువులు.. సాగునీరు నుంచి మద్దతు ధర వరకు నానా అవస్థలు ఎదుర్కొనే వారు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారు.. రైతు బాగుంటే.. రాష్ట్రం బాగుంటుందని భావించిన ఆయన తగిన విధంగా చర్యలు చేపట్టారు.. అందుకు అనుగుణంగా రైతన్న మద్దతు కోసం ఊరూరా భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యలు సెలవు చెప్పారు... దీంతో వ్యవసాయం సందడిగా మారింది.

సాగుకు... సానుకూలం

- ఊరూరా రైతు భరోసా కేంద్రాలు
- విత్తు నాటినప్పటి నుంచి విక్రయం వరకు అండ
- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు



సత్తెనపల్లి: ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభకానుంది. రైతులు బిజీబిజీగా ఉంటారు. వేసవి దుక్కులతో పనులు ప్రారంభమవుతాయి. విత్తనాలు సిద్ధం చేసుకోవడం, ఎరువులు లభ్యతపై ఆరా తీసుకోవడం, ఏ వంగడాలు అందుబాటులో ఉన్నాయనే విషయాలను ప్రణాళిక ప్రకారం రైతులు సన్నద్ధం అవుతుంటారు. అయితే నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను అరికట్టడంలో గత పాలకులు విఫలమవడంతో రైతులు నష్టాలను చవిచూశారు. దీంతో సాగు వ్యయం పెరగడంతో వాటికోసం తెచ్చిన అప్పులు తీరడం లేదని రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు అనేకం చూశాం.

విప్లవాత్మక మార్పులు..

రాష్ట్ర ప్రభుత్వం అన్న దాతకు అండగా ఉంటూ ఎప్పటికప్పుడు వ్యవసాయంలో విప్లవా త్మకమైన మార్పులు తెస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఊరూరా రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టింది. ఈ కేంద్రాలను గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసి వీటి ద్వారా ఆయా శాఖల అధికారులను రైతులకు మరింత అందుబాటులో ఉంచింది. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో 134 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు రైతులకు ఎప్పటి కప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు.

కర్షకుల సేవలో...

వ్యవసాయ సాగులో రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేయడం ఈ కేంద్రాల ప్రధాన బాధ్యత. ఇప్పటి వరకు అధికారులు ఇదే తరహా సేవలు అందిస్తున్న ఈ భరోసా కేంద్రాల ద్వారా మరింత మెరుగైన సేవలు అందుతున్నాయి. వీటికి అను సంధానంగా వ్యవసాయ పరిశోధన, కృషి విజ్ఞాన్ కేంద్రాల నుంచి సీజన్ వారీగా నిపుణులు, శాస్త్రవేత్తలు కూడా అందుబాటులో ఉంటున్నారు. ఈ కేంద్రాల నుంచే రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ప్రయోగశాలలో పరీక్షించిన తర్వాతే వాటిని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. దీనివల్ల నకిలీ, కల్తీలకు అడ్డుకట్ట పడింది.

ప్రకృతి సాగుపై అవగాహన....

రైతులకు సాగు వ్యయం తగ్గించే విధంగా ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నారు. బీజామృతం, జీవామృతం పంచగవ్య, అగ్నాస్త్రం వంటి ప్రకృతి ఎరువుల తయారీ విధానాన్ని నేర్పిస్తున్నారు. భూసార పరీక్షలు చేస్తున్నారు. రైతుల వివరాలు. వ్యవ సాయ భూమి విస్తీర్ణం. సాగు చేసే పంటల వివరాలు. పాడి పశువుల వివరాలు పొందుపరుస్తున్నారు.

డివిజన్‌లో ఆర్‌బీకేలు, సాధారణ విస్తీర్ణం, సీసీఆర్‌సీ కార్డుల వివరాలు

మండలం	ఆర్‌బీకేలు	సాధారణ విస్తీర్ణం	గతేడాది సీసీఆర్‌సీ కార్డులు	ఈ ఏడాది సీసీఆర్సీ కార్డుల లక్ష్యం
సత్తెనపల్లి	20	43,111	2,500	2,600
ముప్పాళ్ళ	14	25,740	1,600	1,700
రాజుపాలెం	14	18,391	1,500	1,600
నకరికల్లు	14	29,140	1,700	1,800
మొత్తం	62	1,16,382	7,300	7,700
పెదకూరపాడు	14	29,033	1,900	2,000
అమరావతి	16	35,802	2,300	2,400
అచ్చంపేట	17	27,203	1,700	1,800
క్రోసూరు	15	28,543	1,900	2,000
బెల్లంకొండ	10	14,636	1,000	1,100
మొత్తం	72	1,35,127	8,800	9,300
డివిజన్ మొత్తం	134	2,51,509	16,100	17,000

డివిజన్‌లో వివిధ పంటల సాగు సాధార్ణ విస్తీర్ణం ఇలా....(ఎకరాల్లో)

మండలం	వరి	పత్తి	మిరప	ఇతర పంటలు
సత్తెనపల్లి	4,188	19,445	13,773	5,705
ముప్పాళ్ళ	5,885	9,050	4,112	6,693
రాజుపాలెం	5,360	5,640	2,613	4,808
నకరికల్లు	17,613	1,785	1,085	8,657
మొత్తం	33,046	35,920	21,583	25,863
పెదకూరపాడు	305	15,280	8,180	5,268
అచ్చంపేట	1,465	14,157	9,370	2,211
బెల్లంకొండ	1,873	8,375	2,395	1,993
క్రోసూరు	3,750	14,707	5,588	4,498
అమరావతి	725	20,217	5,670	9,190
మొత్తం	8,118	72,736	31,203	23,160
డివిజన్ మొత్తం	41,164	1,08,656	52,786	49,023

డ్రైయిన్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

వైద్యాధికారి శ్యామల



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అచ్చంపేట: ఇంటిముందు డ్రెయిన్లలో మురుగు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, మురుగు ద్వారానే దోమలు వ్యాప్తి చెందుతాయని వైద్యాధికారి శ్యామల పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ శ్యామల మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మలేరియా యూనిట్ అధికారి ఎం.బేగ్ మాట్లాడుతూ సకల వ్యాధులకు దోమకాటే ప్రధాన కారణమని చెప్పారు. ఇంటి పరిసరాలలో పాతటైర్లలో, వాడి పడేసిన కొబ్బరిబొండాలలో నీరు నిల్వ ఉంటే దోమల వ్యాప్తికి కారణమవుతాయని అవి లేకుండా చూచుకోవాలన్నారు.

మలేరియా నియంత్రణపై అవగాహన

పెదకూరపాడు: మలేరియాపై భయం వద్దని అవగాహన పెంచుకోవాలని చంద్రాజుపాలెం వైద్యాధికారి కేవీ కోటేశ్వరరావు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని చంద్రాజుపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వికారం, వాంతులు ఉంటే మలేరియాగా గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాణి, విజయలక్ష్మీ, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత




పెదకూరపాడు: పేదల పాలిట పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అమరావతి మండలం ఆత్తలూరు గ్రామానికి చెందిన మదమంచి సుబ్బారావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.80 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, నాయకులు కంకణాల శివాజీ, సాయిరెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' వైద్య సేవలు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో వైద్యాధికారి సాయి తేజారెడ్డి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 124 మందికి పరీక్షలు చేయగా జనరల్ ఓపీ 15 మంది, హైపర్ టెన్షన్ 43 మంది, డయాబెటిస్ 21 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటీస్ 37 మంది, గర్భిణులు ఆరుగురు, బాలింతలు ఇద్దరు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పెండెం మణిరావు, ఎంఎల్‌హెచ్‌పీ డి.తిరుములవేణి, ఏఎన్‌ఎం షేక్ మస్తాన్‌బీ, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఈఓ ఇజ్రాయిల్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నకరికల్లు: సీజనల్ వ్యాధులపై గ్రామీణ వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాస రెడ్డి సూచించారు. నరసరావుపేటలోని శ్రీకేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. వేసవిలో వడదెబ్బకు గురైన వారికి హాస్పిటల్‌కు చేర్చే ముందుగా ప్రాణాపాయం జరగకుండా తీసుకోవాల్సిన ప్రథమచికిత్స, గాయాలైన వారికి, సీజనల్ వ్యాధులకు చేయాల్సిన ప్రతమచికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, కార్యదర్శి సైదా, కేసరి నర్సింహారెడ్డి, బాపతు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

బుక్ ఆఫ్ రికార్డు సాధించిన సుమలతకు అభినందన



సుమలతను అభినందిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే శంకరరావు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన చిగుళ్ల సుమలత బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందుకున్నట్లు శుక్రవారం తెలిపారు. నవ యువతరం ఫౌండేషన్ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా అత్యున్నత సేవలందిస్తూ ప్రెసిడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమలతను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు, రాష్ట్ర అధికార సభ్యులు కత్తి వెంకటేశ్వర్లు, నెహ్రూ యువజన కేంద్రం జిల్లా అధికారి కిరణ్మయిదేవిరెడ్డి అభినందించారు.

జీవన నైపుణ్యాలు అలవాటు చేసుకోవాలి

పెదకూరపాడు: ఆడపిల్లలు ఎదుగుతున్న సమయంలో చదువు, ఆటలు, మాత్రమే కాకుండా జీవన నైపుణ్యాలను అలవాటు చేసుకోవాలని కిశోర బాలికల ప్రాజెక్టు ప్రతినిధి ఎన్.దిలీప్ అన్నారు. గుడ్ షఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దిలీప్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ముందుకు సాగేందుకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని చెప్పారు. సృజనాత్మకత కలిగి ఆలోచించాలన్నారు. క్లిష్టమైన పరిస్థితుల్లో మంచి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గుడ్ షెపర్డ్ డైరెక్టర్ విన్నరసీ మాట్లాడుతూ బాలిక అక్రమ రవాణాల నివారణకు ఏలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలికల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ డియానా, సంస్థ సిబ్బంది లలితకుమారి, కవితలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి

క్రోసూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగపరుచుకుని బాగా చదివించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అందుకూరులోని ఎంపీయూపీ పాఠశాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, మండల అధికారులతో సందర్శించారు. బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో బడిబాట ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి జంగా సౌభాగ్యలక్ష్మి, జంగానవీన్, పంచాయతీ సెక్రటరీ రత్నరాజు, వీఆర్వో రామచంద్రరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కార్తీక్, వెల్ఫేర్ అసిస్టెంట్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

టెన్త్ ప్రతిభావంతులకు బహుమతులు

సత్తెనపల్లి: నియోజకవర్గ యాదవ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన యాదవ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు కన్వీనర్ టీ మదన్మోహన్‌రావు తెలిపారు. పట్టణంలోని నాగార్జున నగర్‌లోని యాదవ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు గుంటూరులోని బండ్లమూడి గార్డెన్స్‌లో గుంటూరు జిల్లా శ్రీకృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సుమారు పది లక్షల రూపాయలు బహుమతులను అందించనున్నట్లు చెప్పారు. 500 పైన మార్కులు సాధించిన వారికి ఈ బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. వంద మందికి మూడు వేల రూపాయలు, ఆ తర్వాత 100 మందికి 2,000, ఆ తర్వాత వచ్చిన వారికి రూ.1000 నగదు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికి ఒక కళాశాల బ్యాగు, ప్రముఖ వక్తలతో ప్రేరణ క్లాసులు నిర్వహించ బడతాయన్నారు. సమావేశంలో నియోజక వర్గ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు లాకు పిచ్చయ్య, సాంబశివరావు, కిరణ్ కుమార్, జయరాం, రాధాకృష్ణ, రామకృష్ణ, ఉన్నారు.

ఉపాధిహామీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



ముప్పాళ్లలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

ముప్పాళ్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామాల్లో బాధ్యతగా పనిచేయాలని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2022- 23 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. పలు కారణాలతో మండలంలో మొత్తం 1368 జాబ్‌కార్డులు తొలగిస్తే కేవలం 13 కార్డులు మాత్రమే మరలా పునరుద్ధరించారని, మిగిలిన వారికి ఎందుకు జాబ్‌కార్డులు ఇవ్వలేకపోయారని సిబ్బందిని ప్రశ్నించారు. ఈ నెలాఖరు కల్లా పోయిన కార్డులన్నీ మరలా అందుబాటులోకి తెచ్చి వారందరికీ పని కల్పించాలని లేకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక గ్రామంలో కేవలం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కూడా పని కల్పించలేక పోతుండటాన్ని గమనించినట్లు వేదిక దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి గ్రామంలోను ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద రోజులు పనిదినాలు కల్పించేలా ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పనిచేయాలన్నారు. రికార్డుల నిర్వహణలో బాధ్యత లేకుండా పనిచేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఓ రామారావు, టీఏ శ్రీకాంత్ పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.26,807 రికవరీ...

మండలంలో2022-23 ఆర్థిక సంవత్సరం కు గాను మొత్తం 694 పనులకు గాను రూ.4కోట్ల55లక్షల65 వేల463 నిధులు ఖర్చు చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో వెల్లడించారు. మస్టర్‌లలో తేడాలున్నట్లుగా గుర్తించారు, సంతకాలు లేకుండా పనికి వచ్చినట్లుగా వారి ఖాతాల్లో కూలీ జమచేయటం, మస్టర్ జాబితాలో పేర్లు యాడ్ చేయటం వంటి అవకతవకలను గుర్తించినట్లు ప్రజావేదికలో వెల్లడించారు. మొత్తం 26,807 అక్రమాలు జరిగినట్లుగా గుర్తించారు. వాటన్నింటినీ సంబంధిత సిబ్బంది వద్ద నుంచి రికవరీ చేయాలని పీడీ జోసఫ్‌కుమార్ ఆదేశించారు. వీటితో పాటుగా రూ.29,877 లకు సంబంధించి జరిగిన పనులపై ఏపీడీ విచారణ జరిపి నివేదిక అందించాలని చెప్పారు.

చాగంటివారిపాలెంలో పనులపై విచారణ...

చాగంటివారిపాలెంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ పనులలో అక్రమాలు జరిగాయని గ్రామస్తులు ప్రజావేదిక వద్ద పీడీ జోసఫ్‌కుమార్ దృష్టికి తెచ్చారు. పనులు చేయకుండానే వారి ఖాతాల్లో కూలీ డబ్బులు జమ చేసి సుమారు రూ.10లక్షల వరకు అక్రమాలకు పాల్పడ్డారని, పది రోజుల క్రితం విచారణ జరపాలంటూ ఎంపీడీఓకి అర్జీ అందించినా స్పందించటం లేదని వారు పీడీ దృష్టికి తెచ్చారు. అక్రమాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే, విచారణ జరిపిస్తామని పీడీ గ్రామస్తులకు తెలిపారు. గ్రామంలో జరిగిన పనులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని ఏపీడీ వెంకటనారాయణను ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా విజిలెన్స్ అధికారి టీవీ విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ బాబూరావు, ఎస్పార్పీ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఏటీఎం ధ్వంసం కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ కోటేశ్వరరావు

నకరికల్లు: ఏటీఎం ధ్వంసం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నకరికల్లులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇండియా- 1 ఏటీఎం ఉంది. మే 23, అర్ధ రాత్రి స్థానిక ఎన్నెస్పీ కాలనీకి చెందిన అల్లం శివకృష్ణారెడ్డి, తన ఏటీఎం కార్డు ద్వారా నగదు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. డబ్బులు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లాడు. మరో 20 నిమిషాల వ్యవధిలోనే దుస్తులు మార్చుకొని వచ్చి గడ్డపలుగుతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేశాడు. నగదు రాకపోవడంతో శాటిలైట్ పరికరాన్ని ఎత్తుకెళ్లాడు. ఎస్ఐ పి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని నకరికల్లులోని ఎన్నెస్పీ కాలనీలో అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు. రోజుల వ్యవధిలో కేసును ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు.

బాల కార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరం




పట్టణంలోని 23వ వార్డులో మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి: పలక పట్టాల్సిన వయసులో చిన్నారులను పనులు చేపించి బాల కార్మికులుగా మారిస్తే అది చట్ట రీత్యా నేరమని, ఆ సంస్థల యజమానులపై కేసులు నమోదు చేస్తారని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకట లక్ష్మి సూచనల మేరకు పట్టణంలోని 23వ వార్డులోని వెంకటపతి కాలనీలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత ఒక టీంలా ఏర్పడి ఆ ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులను వారి పిల్లలు ఏఏ స్కూల్లో విద్యనభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయ వాదులు లక్ష్మణ్, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి ,పారా లీగల్ వాలంటీర్లు షేక్ ఖాజా, షేక్ ముబారక్, ఆ వార్డు సచివాల సిబ్బంది ఆనంద్ లు పాల్గొన్నారు.

గోరంట్ల గ్రామంలో....

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. శుక్రవారం సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్, ఐసీడీఎస్, సేవే ప్రాణం సేవే జీవితం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పిల్లలను జీరో నుంచి ఐదు సంవత్సరాల లోపల పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లో చేర్పించాలని, ఐదు సంవత్సరాల పైబడిన వారిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం యల్లమంద, నాగేశ్వరరావు, సుశీల చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు బిస్కెట్స్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నందిగామ సుశీల, సేవే ప్రాణం సేవ జీవితం సర్వీస్ సొసైటీ అధ్యక్షులు నందిగామ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ యల్లమంద పాల్గొన్నారు.

కౌలు కార్డుతో మద్దతు ధరకు అమ్ముకోవచ్చు



మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీశంకర్

గోళ్ళపాడు(ముప్పాళ్ల): కౌలు కార్డు(పంట సాగు పత్రం)తో ప్రభుత్వం అందించే మద్దతు ధరకు పంటలను అమ్ముకోవచ్చని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. మండలంలోని గోళ్లపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లో కౌలు కార్డు మంజూరుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ భవానీశంకర్ మాట్లాడుతూ పంటలకు మార్కెట్‌లో ధర సరిగ్గా లేనప్పుడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఆర్బీకేలో అమ్ముకోవచ్చన్నారు. సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా వర్తిస్తుందన్నారు. భూయజమానికి, సాగుదారునికి మధ్య ఉండే ఒప్పందం పత్రం మాత్రమేనన్నారు. భూయజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయా గ్రామసభల్లో సర్పంచులు గోపు అప్పమ్మ, మోర్తాల వెంకటరమణారెడ్డి, ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పశు భీమా కింద రూ.55వేలు అందజేత

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన పాడిరైతు కంచేటి రమాదేవీకి చెందిన పాడి గేదె గతనెలలో అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం సంగం డెయిరీ పశుభీమా పథకం కింద రూ.55వేలు అందజేశారు. రెంటపాళ్ల బీఎంసీ పశువైద్యులు అబ్దుల్‌కరీం మాట్లాడుతూ పాడి పోషకులు తమ పశువులను భీమా చేయించుకోవటం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేనేజరు టి.గోపి, పాలసేకరణ కేంద్రం నిర్వహకుడు కోటిరెడ్డి పాల్గొన్నారు.